క్లుప్తంగా

నేడు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

మహేశ్వరం: మండలం పరిధిలోని మహేశ్వరం, మన్సాన్‌పల్లి, ఉప్పుగడ్డ తండాల్లో శనివారం అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం ఉంటుందని ఇన్‌చార్జి ఎంపీపీ సునీతానాయక్ అన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ పనులు ప్రారంభోత్సవానికి మంత్రులు సబితారెడ్డి, సత్యవతి రాథోడ్, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి ఉదయం 10 గంటలకు హాజరవుతారని చెప్పారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు సకాలంలో హాజరవ్వాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కె.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ చిత్రా లేఅవుట్ ఫీడర్ పరిధిలో ఉదయం 11గంటల నుంచి 12 గంటల వరకు. 11కేవీ ఆలిండియా రేడియో, రాఘవేంద్రకాలనీ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం లఒంటి గంట వరకు. 11కేవీ స్వాతి రెసిడెన్సీ ఫీడర్ పరిధిలోని కాలనీలలో సాయంత్రం 4గంటల నుంచి 5 గంటల వరకు ఈ అంతరాయం ఉంటుందన్నారు.

కనీస వేతనం చెల్లించాలి

ఆశ వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు సరస్వతి



కందుకూరులో సమ్మె చేస్తున్న ఆశ వర్కర్లు

కందుకూరు: మండల కార్యాలయాల ఆవరణంలో సమస్యల పరిష్కారం కోరుతూ ఆశ వర్కర్లు చేపట్టిన సమ్మె శుక్రవారం 5వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆశ వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు సరస్వతి మాట్లాడారు. ఐదు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదని విమర్శించారు. ఆశ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి, నెలకు రూ.18 వేల వేతనంతో పాటు ఉద్యోగ భద్రతతో, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు హేమలత, అనిత, సుజాత, జయసుధ, సువర్ణ, ముంతాజ్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

ఇన్‌చార్జి ఎంపీపీ సునీతా నాయక్

మహేశ్వరం: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం లాంటిదని ఇన్‌చార్జి ఎంపీపీ సునీతానాయక్ అన్నారు. శుక్రవారం ఆమె బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా సునీతానాయక్ మాట్లాడుతూ.. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు ప్రభుత్వం నిరతరం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఆలయ డైరెక్టర్ కర్రోళ్ల చంద్రయ్య,అంధ్యానాయక్, శివగంగ రాజరాజేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ నిమ్మగూడెం సుధీర్ గౌడ్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మునగపాటి నవీన్, మండల కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఆదిల్, మైనార్టీ నాయకులు ఆజాం, కృష్ణ యాదవ్ తదిరులు పాల్గొన్నారు.

వైభవంగా రాహు కేతు పూజ

ఎల్‌బీనగర్: రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్‌లోని పీఎస్ఆర్ శ్లోక కన్వెన్షన్‌లో శ్రీరాజరాజేశ్వరి శక్తి పీఠం ఆధ్వర్యంలో మొల్లూరి నవీన్‌శర్మ నిర్వహించిన మహాకాల సర్పరాహు కేతు పూజా మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి హాజరై పూజలో పాల్గొన్నారు. రంగారెడ్డి జిల్లా అర్బన్ కార్యవర్గ సభ్యులు నర్సింహారెడ్డి, విష్ణువర్దన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సమన్యాయం

మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయికులు

ఇబ్రహీంపట్నం: టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో శుక్రవారం పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీతోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని మల్‌రెడ్డి స్పష్టం చేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమన్నారు. బీఆర్ఎస్ పార్టీ, సీఎం కేసీఆర్ హామలను నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో బీఆర్ఎస్ పార్టీకి దిమ్మతిరిగే సమాధానం ఇవ్వాలన్నారు. బహిరంగ సభల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామన్నారు. హయత్‌నగర్ ప్రాథమిక సహకార సంఘం డైరెక్టర్ రాజశేఖర్‌రావు, నగేశ్, భానుచందర్ కాంగ్రెస్ పార్టీలో చేరినవారిలో ఉన్నారు.

సర్కార్‌లో టెస్టులు ఫ్రీ

- పైసా ఖర్చు లేకుండా వ్యాధి నిర్ధారణ పరీక్షలు
- ప్రజలకు ఉపయోగకరంగా తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్
- బాలాపూర్ ఆసుపత్రిలో ప్రతీరోజు దాదాపు 70 మంది నమూనాల సేకరణ



బాలాపూర్ ఆస్పత్రిలో రక్త నమూనాలను సేకరిస్తున్న తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్ సిబ్బంది

వైద్యం ఖరీదు పెరిగింది. రోగ నిర్ధారణ పరీక్షల ఖర్చులు భారంగా మారుతున్నాయి. దీంతో సర్కార్ ఈ పరీక్షలన్నీ ఉచితంగా చేసేందుకు టీ–డయాగ్నోస్టిక్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది.

మీర్‌పేట: పేదలకు భారంగా మారిన వ్యాధి నిర్ధారణ పరీక్షలను ఉచితంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్‌ను ఏర్పాటు చేసిన విషయం విదితమే. బాలాపూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డయాగ్నోస్టిక్ సెంటర్‌కు ప్రతీ రోజు వ్యాధి నిర్ధారణ పరీక్షల నిమిత్తం సామాన్య ప్రజలు అధిక సంఖ్యలో వస్తున్నారు. ఇందులో మూత్ర పరీక్షల నుంచి మొదలు రక్త, ఫీవర్, కొలెస్ట్రాల్, కిడ్నీ, లివర్ ఫంక్షన్, షుగర్, జాయింట్ పేయిన్స్, మలేరియా, డెంగీ, టైఫాయిడ్‌తో పాటు వందకు పైగా నిర్ధారణ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు డయాగ్నోస్టిక్ సెంటర్ అందుబాటులో ఉంటుండగా, ప్రతిరోజు దాదాపు 70 మంది నుంచి నిర్ధారణ పరీక్షల నిమిత్తం నమూనాలను సేకరిస్తున్నామని వైద్య సిబ్బంది తెలిపారు. 24 గంటల్లో రోగుల సెల్‌ఫోన్‌కు మెసేజ్ రూపంలో పరీక్షల వివరాలు పంపిస్తున్నామన్నారు. ఎక్కువగా డయాబెటిక్, గర్భిణీలు డయాగ్నోస్టిక్ సెంటర్‌కు పరీక్షల నిమిత్తం వస్తారని సిబ్బంది చెప్పారు.

పేదలకు ఎంతో మేలు

పేద ప్రజల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్ ఎంతగానో ఉపయోగపడుతోంది. కందుకూరు మెడికల్ డివిజన్ పరిధిలోనే అధికంగా ప్రజలు బాలాపూర్ ఆసుపత్రిలో నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటున్నారు. దీంతో పాటు ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళా కార్యక్రమం ద్వారా స్త్రీ సంబంధిత వ్యాధులకు పరీక్షలు నిర్వహిస్తున్నాం.

– నర్సింగ్‌రావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, బాలాపూర్

ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం



సిబ్బందికి మందులను అందజేస్తున్న జల్‌పల్లి కమిషనర్ వసంత

పహాడీషరీఫ్: ఆరోగ్యంపై ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ ఎస్.వసంత అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో సిబ్బందికి బాలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆదిత్య చక్రవర్తుల సిబ్బందికి బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో పనిచేసే సిబ్బంది ఉదయం 5 గంటల నుంచే విధుల్లో ఉంటూ మున్సిపాలిటీని స్వచ్ఛతగా ఉంచడంలో ఎంతో కృషి చేస్తారన్నారు. వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని కోరడంతో వైద్యులు స్పందించి శిబిరాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ నర్సింగ్ రావు, హెచ్‌ఈఓ వినోద్, ఆరోగ్య కార్యకర్తలు అజయ్, సైదులు, స్నేహలత, మౌలానా, సద్గుణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతుడే అసలైన కోటీశ్వరుడు

దిల్‌సుఖ్‌నగర్: ఎలాంటి అనారోగ్య సమస్యలు లేని ఆరోగ్యవంతుడే అసలైన కోటీశ్వరుడని కొత్తపేటలోని ఓజోన్ హాస్పిటల్స్ చైర్మన్ బీవీ సత్యసాయి ప్రసాద్ అన్నారు. శుక్రవారం వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఆర్‌కేపురంలోని ఓజోన్ ఆసుపత్రిలో నిర్వహించిన సీపీఆర్ క్యాంపు కార్యక్రమానికి కొత్తపేట, గడ్డిఅన్నారం కార్పొరేటర్లు పవన్ కుమార్, బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ఆహార అలవాట్లు అనారోగ్యానికి దారి తీస్తాయన్నారు. మద్యపానం, ధూమపానం వంటి దురలవాట్లకు దూరంగా ఉంటూ ప్రతిరోజు వ్యాయామం చేయాలని సూచించారు. ఓజోన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో రాచకొండ కమిషనర్‌లోని అన్ని పోలీసుస్టేషన్ల సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

అమలుకు నోచుకోని సీఎం హామీ



కందుకూరులో సమ్మె చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

మండల కన్వీనర్ బాలరాజు

కందుకూరు: సమస్యల పరిష్కారానికి మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం 2వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాలరాజు మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ఆరు నెలలుగా బిల్లులు రాక, సంవత్సర కాలంగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అప్పులు చేసి పాఠశాలల్లో విద్యార్థులకు భోజనం వండి పెడుతున్నారన్నారు. రెండేళ్ల క్రితం సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా మధ్యాహ్న భోజన కార్మికులకు అదనంగా రూ.2 వేలు చొప్పున పెంచుతామని హామీ ఇచ్చినా నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. నాలుగైదు నెలలకు ఒకసారి మెస్ చార్జీలు వేస్తున్నారన్నారు. మెస్ చార్జీలు పెంచాలని, కోడిగుడ్డు ధర రూ.7 ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యంతో పాటు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల అధ్యక్షురాలు ప్రభావతి, సభ్యులు శ్రీనివాస్, మంగ, గీత, లక్ష్మమ్మ, అంజమ్మ, రాములమ్మ, సుగుణ, లావణ్య పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి



వైద్య విద్యార్థులను సత్కరిస్తున్న సామ రంగారెడ్డి

బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి

హస్తినాపురం: విద్యలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని శ్రీరమణకాలనీకి చెందిన మెడిసిన్‌లో సీటు సాధించిన కె.దీపిక, బీఆర్ మోనికతో పాటు చదువులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన జాహ్నవి, ఎం.సంధ్యారాణి, రితిక, రుచితలను రంగారెడ్డి శాలువకప్పి సత్కరించారు. మల్లేశ్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, కాలనీ ప్రతినిధులు బాలాజీరావు, ప్రశాంత్, దోమలపల్లి సుధాకర్, సంతోష్, రాజశేఖర్ , రామచంద్రజీ, సుధాకర్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నిమజ్జనం.. శోభాయమానం

- గంగమ్మ ఒడికి చేరిన గణపతి
- వేలంలో లక్షలు పలికిన లడ్డూలు



బడంగ్‌పేట్: లడ్డూను దక్కించుకున్న శ్రీకృష్ణ కాలనీ అసోసియేషన్ సభ్యుడు రవికాంత్‌రెడ్డి

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలో కొన్ని కాలనీలు, డివిజన్లో గణనాథుడి నిమజ్జనాలు, శోభాయాత్రలు శుక్రవారం కొనసాగాయి. కార్పొరేషన్ పరిధిలోని 28వ డివిజన్ శ్రీకృష్ణ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథుడి ఊరేగింపు సందర్భంగా లడ్డూ వేలం వేశారు. కాలనీవాసి సమ్మిరెడ్డి రవికాంత్‌రెడ్డి కుటుంబసభ్యులు మీనా, రిశాంత్‌రెడ్డి, విక్రాంత్ రెడ్డిలు రూ.75వేలకు లడ్డూ సొంతం చేసుకున్నారు. కలశం, పంచను రూ.27వేలకు ఎం.భాస్కర్ లావణ్య దంపతులు దక్కించుకున్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సుబ్రమణ్యస్వామి, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌గౌడ్, రాఘవేందర్‌రావు, కార్యదర్శి గంధీలాల్, కోశాధికారి జిల్లెల శేఖర్, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

వరుసగా మూడోసారి..

బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ 19వ డివిజన్‌లోని గాయత్రిహిల్స్ కాలనీ రోడ్ నెంబర్–2లో మైఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ లడ్డూకు వేలం వేశారు. బీఆర్ఎస్ కార్పొరేషన్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ఈశ్వరోజు బాలేశ్‌చారి రూ.1.5 లక్షలకు లడ్డూ సొంతం చేసుకున్నారు. మై ఫ్రెండ్స్ యూత్ లడ్డూ మూడో సారి దక్కించుకోవడం ఆనందంగా ఉందని బాలేశ్‌చారి పేర్కొన్నారు.

కందురూరు: మండల పరిధిలోని దాసర్లపల్లిలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద లడ్డూను గ్రామానికి చెందిన కె.జయేందర్ రూ.25 వేలకు శుక్రవారం దక్కించుకున్నారు. అదే గ్రామంలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద రూ.16,500లకు అంజయ్య, రూ.15వేలకు వనజమ్మ వేలంలో దక్కించుకున్నారు.



బడంగ్‌పేట్: బాలేశ్‌చారిని సన్మానిస్తున్న కమిటీ సభ్యులు



కందుకూరు: దాసర్లపల్లిలో ముదిరాజ్ సంఘం లడ్డూ దక్కించుంకున్న కె.జయేందర్

మహిళల స్వావలంబనకు కేసీఆర్ కృషి

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



మహిళల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కమలా సుధీర్‌రెడ్డి తదితరులు

వనస్థలిపురం: అన్ని రంగాల్లో మహిళల స్వావలంబన, సాధికారత కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ అవిరళ కృషి చేస్తున్నారని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హస్తినాపురం జీఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ఎల్‌బీనగర్ నియోజక వర్గం మహిళల ఆత్మీయ సమ్మేళన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళల కోసం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఒంటరి మహిళలకు పింఛన్లు, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, ఆరోగ్య మహిళ, షీ టీమ్స్, భరోసా కేంద్రాల ఏర్పాటు, మార్కెట్ కమిటీలలో మహిళలకు రిజర్వేషన్లతో పాటు త్వరలో గృహలక్ష్మి పేరిట ఇల్లు నిర్మించుకునేందుకు రూ. 3 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారన్నారు.ప్రభుత్వ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, జయచంద్రారెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ కమలా సుధీర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు గజ్జల సుష్మ మధుసూదన్ రెడ్డి, పద్మా శ్రీనివాస్, చెరుకు సంగీత ప్రశాంత్‌గౌడ్, ముద్రబోయిన శ్రీనివాస రావు, కొప్పుల విఠల్ రెడ్డి, జిట్టా రాజశేఖర్‌రెడ్డి, జిన్నారం విఠల్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, నాయకులు ఈశ్వరమ్మ యాదవ్, అనంతుల రాజిరెడ్డి, డివిజన్ల మహిళా నాయకురాళ్లు,స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలి

బ్యాంకులు ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలని, పెరుగుతున్న కాలనీలు, జనాభా దృష్ట్యా బ్రాంచిల సంఖ్యను పెంచాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హస్తినాపురం ఈస్ట్‌లో సాగర్ రహదారిపై నూతనంగా ఏర్పాటుచేసిన ఫెడరల్ బ్యాంక్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, జోనల్ హెడ్ దిలీప్ మాట్లాడుతూ, తమ ఫెడరల్ బ్యాంక్ 29వ బ్రాంచిని హస్తినాపురంలో ఏర్పాటు చేశామన్నారు. ఆధునిక సౌకర్యాలతో ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కర్మన్‌ఘాట్ హనుమాన్ టెంపుల్ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శాలినీ వారియర్, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ నంద కుమార్, వైస్ ప్రెసిడెంట్ జోస్ థామస్, బ్రాంచి మేనేజర్ శ్రవణ్, నాయకులు జయపాల్‌రెడ్డి, వాయుకుమార్, అరవింద్‌రెడ్డి పాల్గొన్నారు.

బస్ పాసులు వినియోగించుకోండి

సర్పంచ్ జ్యోతిగుప్తా



బస్ పాసులను పంపిణీ చేస్తున్న సర్పంచ్ జ్యోతిగుప్తా

కందుకూరు: విద్యార్థులు ఆర్టీసీ బస్ పాసులను సద్వినియోగం చేసుకోవాలని మీర్‌ఖాన్ పేట్ సర్పంచ్ జ్యోతిగుప్తా సూచించారు. శుక్రవారం ఆమె మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సొంత ఖర్చుతో ఆర్టీసీ బస్ పాసులను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... పేదల విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేస్తామన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్, బాకారం అనంతలక్ష్మి, మోహన్‌రెడ్డి, హెచ్‌ఎం శ్రీధర్, ఇబ్రాహీంపట్నం అసిస్టెంట్ మేనేజర్ సరస్వతి, సదానందం, యాదగిరి, శ్రీనివాస్, మల్లేశ్, వెంకట్‌రెడ్డి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట




కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, నాయకులు

- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ

కడ్తాల్: మైనార్టీల సంక్షేమానికి తెలంగాణ సర్కార్ పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని ఎంబీఏ గార్డెన్‌లో మైనార్టీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కడ్తాల్, తలకొండపల్లి, ఆమనగల్లు మండలాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ముస్లింలకు షాదీముబారక్ పథకం, రంజాన్‌కు దుస్తుల పంపిణీ, మసీద్ మరమ్మతులకు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్, బీజేపీలు.. మైనార్టీల సంక్షేమానికి చేసిందేమీ లేదని విమర్శించారు. మరోసారి బీఆర్ఎస్ పార్టీని ఆశీర్వదించాలన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్మన్ సత్యం, మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీలు దశరథ్‌నాయక్, ఉప్పల వెంకటేశ్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, వైస్ ఎంపీపీ ఆనంతరెడ్డి, రైతుబంధు మండలాల అధ్యక్షులు వీరయ్య తదితరులు ఉన్నారు.

కార్యకర్తల అభిప్రాయం తీసుకోవాలి

కాంగ్రెస్ సీనియర్ నేత రాములు



సమావేశంలో మాట్లాడుతున్న రాములు

ఆమనగల్లు: మెజార్టీ కార్యకర్తల అభిప్రాయం మేరకే కల్వకుర్తి అసెంబ్లీ టికెట్ ఇవ్వాలని కాంగ్రెస్ సీనియర్ నేత మండ్లి రాములు అన్నారు. ఎన్నికల ముందు ఇతరపార్టీల నుంచి వచ్చే నాయకులకు టికెట్ ఇస్తే సహించేది లేదన్నారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని.. అతనికే కల్వకుర్తి ఎమ్మెల్యే టికెట్ ఖరారైందని వార్తలు వస్తున్నాయని తెలిపారు. ఇందులో నిజానిజాలను కాంగ్రెస్ అగ్రనాయకులు కార్యకర్తలకు వివరించాలని కోరారు. పార్టీలోకి రాగానే టికెట్ ఎలా ఇస్తారని, కార్యకర్తల అభిప్రాయం తీసుకుని టికెట్ కేటాయిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్‌పార్టీ కోసం నిరంతరం పనిచేస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డికి కల్వకుర్తి కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలని ఆయన కోరారు. లేదంటే కాంగ్రెస్‌లోని సీనియర్ నాయకులకు టికెట్ ఇవ్వాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు శ్రీరాములు, రాజశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, రాఘవేందర్, జైపాల్‌నాయక్, గోవింద్, రామస్వామి, లాలునాయక్, రాములు, రాజు, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

ప్రధాని సభకు తరలిరండి

బీజేపీ కిసాన్‌మోర్చా

ఆమనగల్లు: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో అక్టోబర్ 1న నిర్వహించే ప్రధానమంత్రి నరేంద్రమోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ నాయకుడు మధుసూదన్‌రెడ్డి కోరారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మోదీ సభకు నాయకులు, అభిమానులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు హరిప్రసాద్, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, బీజేపీ నాయకులు వంశీధర్, నర్సింహారెడ్డి, నర్సింహ, శ్రీకాంత్‌సింగ్, విజయ్‌కృష్ణ, శ్రీనివాస్, రాఘవేందర్ పాల్గొన్నారు.